# మనం

## కృష్ణా / గుంటూరు

ఎన్‌టీఆర్ - బాపట్ల - పల్నాడు

గురువారం | 10 | జూలై | 2025 | పేజీలు : 6


## డ్రైనేజీ శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



పెనమలూరు, జూలై 09 (మనం న్యూస్): కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో భాగంగా పెనమలూరు నియోజకవర్గం తాడిగడప మున్సిపాలిటీ కానూరు గ్రామం నాగార్జున హాస్పిటల్ వాటర్ ట్యాంక్ రోడ్ లో డ్రైనేజీ శంకుస్థాపన కార్యక్రమంలో నియోజకవర్గం ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కూటమి నాయకులు, జనసేనపార్టీ సెంట్రల్ ఆంధ్రా జోన్ కో-కన్వీనర్ బొల్లం విరన్ కుమార్, కంకిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వడ్డీ జీవ, తాడిగడప మున్సిపల్ ఉపాధ్యక్షులు తిరుమలశెట్టి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# కదం తొక్కిన కార్మిక వర్గం



- విజయవాడలో సమ్మె సంపూర్ణం
- సమ్మెలో వేలాదిగా పాల్గొన్న కార్మికులు
- భారీగా ర్యాలీ, నిరసనలు నినాదాలతో దద్దరిల్లిన రోడ్లు

-విజయవాడ సెంట్రల్, మనం న్యూస్

2 లో

# జై దుర్గ భవాని ... శాకంభరీ నమోస్తుతే..



ఇంద్రకీలాద్రి పై రెండవ రోజు శాకంభరి ఉత్సవాలు రెండవ రోజైన బుదవారం ఘనంగా జరిగాయి. జులై 10 మూడవరోజు గురువారం ఉదయం 9:30 కు మహా పూర్ణాహుతితో ఉత్సవం సమాప్తమవనున్నది.

-విజయవాడ పశ్చిమ, మనం న్యూస్

2 లో



## సీజనల్ వ్యాధులపై

# అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

-విజయవాడ సెంట్రల్, మనం న్యూస్

2 లో

# అసెంబ్లీకి రారు... ప్రజల్లో ఉండరు



- గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా తీసింది
- మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైంది
- ఇష్టానురీతిన వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు
- మహిళల పై దూషణలకు పాల్పడుతున్నారు
- ప్రజలు గుణపాఠం చెప్పినా బుద్ధి రాలే
- ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమా

-విజయవాడ సెంట్రల్, మనం న్యూస్

2 లో

# జాతి కోసం మధ్యవర్తిత్వం

- **కృష్ణా జిల్లా జడ్జి జస్టిస్ జి.గోపి**



**విజయవాడ సెంట్రల్, జూలై 09 (మనం న్యూస్):** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసులు త్వరిత గాతిన పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా 90 రోజుల్లో మీడియేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి. గోపి అన్నారు. బుధవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 64 మంది మీడియేటర్లకు ఒకరోజు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా న్యాయమూర్తి గోపి మాట్లాడుతూ మహాకవి వచనాలతో మనల్ని మనం సరిదిద్దుకోవాలని అన్నారు. ఆలోచనలలో మార్పు రావాలని అన్నారు. జాతి పున:ర్నిర్మాణం కోసం అందరూ దిద్దుబాటు వైపు ప్రయాణం చేయాలని అన్నారు.30 సంవత్సరాలు, 20 సంవత్సరాలు, 10 సంవత్సరాలు పైబడిన కేసులు దేశవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. చరిత్ర చూసుకుంటే శ్రీకృష్ణుడు కూడా కౌరవులకు పాండవులకు మధ్య మధ్యవర్తిగా వ్యవహరించాడని అన్నారు. మధ్యవర్తి మాట వినకపోవడం వల్ల యుద్ధం పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అనంతరం జిల్లా జడ్జి పాడిన పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కృష్ణా జిల్లా లీగల్ సర్వీసెస్ అధారిటీ కార్యదర్శి రామకృష్ణయ్య మాట్లాడుతూ కక్షిదారులకు మంచి వాతావరణం ఏర్పడడానికి మీడియేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మానవాళి సంక్షేమం కోసం దేశాల మధ్య క్షేమం కోసం మీడియేషన్ ఎంతగానో ఉపయోగపడిన విషయం అందరు తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవధికార సంస్థ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలో ఎంపిక చేసిన 11 బార్ అసోసియేషన్ లకి చెందిన 64 మంది న్యాయవాదులు, సోషల్ వర్కర్స్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు రాబోయే 90 రోజులలో మీడియేషన్ ద్వారా పలు కేసులు పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రెండవ అదనపు జిల్లా జడ్జి, 12వ జిల్లా జడ్జి మచిలీపట్నం బార్ అసోసియేషన్ నుండి లంకిశెట్టి బాలాజీ, అడపా మురళి తదితరులు పాల్గొన్నారు.

# కదం తొక్కిన కార్మిక వర్గం

**మొదటి పేజీ తరువాయి...**



**విజయవాడ సెంట్రల్, జూలై 09 (మనం న్యూస్):** రాష్ట్ర రాజకీయ రాజధాని విజయవాడలో కార్మికుల సమ్మె విజయవంతమైంది. తమ విధులను బహిష్కరించి సమ్మెలో వేలాదిగా కార్మిక వర్గం పాల్గొన్నారు. రైల్వే, బ్యాంకు, ఎల్ఐసి, వివిధ సంఘటిత, అసంఘటితరంగాల కార్మికులు వేలాదిగా సమ్మెలో పాల్గొన్నారు. విజయవాడ వన్ టౌన్ రథం సెంటర్ నుంచి లోబ్రిడ్జి మీదుగా, ఏలూరు రోడ్డు లెనిన్ సెంటర్ కు ప్రదర్శనగా చేరుకున్నారు. ప్రదర్శనలో నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం 26,వేలు ఇవ్వాలని, 10.గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, నూతన వ్యవసాయం మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. కార్మిక, కర్షక ఐక్యత వర్ధిల్లాలంటూ పెద్దపెట్టున నినదించారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం లెనిన్ సెంటర్లో జరిగిన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ఎ.ఐ.టి.యు.సి నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, సి.ఐ.టి.యు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కె.దుర్గారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల రాష్ట్ర నాయకత్వం మాట్లాడారు. ఈ సమ్మె కేవలం కొసమెరుపు మాత్రమేనన్నారు. రానున్న రోజుల్లో బిజెపి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున యుద్ధం చేయాల్సి ఉందన్నారు. లేబర్ కోడ్లు రద్దు అయ్యే వరకు, కార్మిక చట్టాలు అమలయ్యే వరకు పోరాటం ఆగేది లేదన్నారు. బడా కార్పొరేట్ కంపెనీల కోసం వారికి అనుకూల చట్టాలను రూపొందిస్తున్నారని, కంపెనీల దోపిడీకి ద్వారాలు బార్లా తెరిచారని విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా సిఐటియు అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, సిఐటి జిల్లా ఉపాధ్యక్షులు దోనెపూడి కాశీనాథ్ తదితరులు ప్రసంగించారు. ఈ ప్రదర్శనకు మద్దతుగా సి.పి.ఎం పార్టీ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు నాయకత్వాన మద్దతు పలికారు. ప్రదర్శన బహిరంగ సభలో వేలాది మంది భారీ ప్రదర్శనకు అన్ని రంగాల కార్మిక సంఘాల అనుబంధ యూనియన్లు, రైతు, కూలీ, కౌలు రైతు, ముఠా, ఆటో, బిల్డింగ్, హాకర్స్ ,షాపు,హోటల్, ఆశ, అంగన్వాడీ, బ్యాంక్, ఇన్సూరెన్స్, రైల్వే, స్కీమ్ వరక్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వన్ టౌన్, మార్కెట్ సెంటర్, రైల్వే లో బిడ్జ్, బస్టాండ్, ఏలూరు రోడ్, లెనిన్ సెంటర్లో ట్రాఫిక్ అంతరాయం జరిగింది. పోలీసులు వాహనాల్ని ట్రాఫిక్ ని పక్కకు మళ్ళించారు. ఈ సమ్మె కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలగాలని కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేశాయి.

# అసెంబ్లీకి రారు...ప్రజల్లో ఉండరు

**మొదటి పేజీ తరువాయి...**



విజయవాడ భానునగర్ వీధులన్నీ తిరుగుతూ అన్ని డ్రైనేజీలను,రోడ్లను పరిశీలించి స్థానికంగా అక్కడ ఉన్న ప్రతి సమస్యను ప్రజలనుంచి అడిగి తెలుసుకొని, వీలైనంత త్వరగా అక్కడ ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం సాయంత్రం సెంట్రల్ నియోజకవర్గం లోని 28వ డివిజన్ భానునగర్ లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ప్రజలకు పంచారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ వైసిపి నాయకులకు దమ్ముంటే ప్రజల్లోకి రావాలన్నారు. మళ్ళీ ప్రజలను మోసం చేందుకు వైసీపీ సిద్ధం అయ్యిందన్నారు. 2019 నుండి 2024 వరకు లోటు బడ్జెట్ తో దివాలా తీసే పరిస్థితిలోకి రాష్ట్రాన్ని గత వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. గెలిచిన వైసిపి నాయకులు అసెంబ్లీకి రాకపోగా, కనీసం ప్రజల్లోకి కూడా రావటం లేదన్నారు. ఇష్ట రీతిన వైసిపి నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. మహిళల పై దూషణలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వీరమాచినేని లలిత, వీరమాచినేని కిషోర్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**మొదటి పేజీ తరువాయి...**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలని, డెంగీ, మలేరియా, డయేరియా కేసులు నమోదుకాకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు.సీజనల్ వ్యాధులతో పాటు ఉపాధి హామీ పథకం అమలు, ఉద్యాన పంటల పెంపకం అంశాలపై కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, వైద్యాధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎక్కడైనా వ్యాధి కేసు నమోదైతే పరిసర ప్రాంతాలలో ఇంటింటి సర్వే నిర్వహించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. క్రమంతప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఎక్కడా వర్షపునీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. యాంటీ లార్వాల్ ఆపరేషన్లు విస్తృత స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. జ్వరాల కేసుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్కు అందిస్తే అక్కడి నుంచి ఆయా ప్రాంతాల క్షేత్రస్థాయి బృందాలను అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. సమన్వయం విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను ప్రాణంపెట్టి చేయాలని.. దీనివల్ల ప్రజలకు ఆరోగ్య భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. దోమల నియంత్రణతో పాటు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు, డిజిటల్ కంటెంట్, వీడియో షార్ట్ క్లిప్పింగ్స్ వంటివాటితో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజా భాగస్వామ్యంతో ప్రత్యేకంగా ర్యాలీలు వంటివి నిర్వహించాలని స్పష్టం చేశారు. తాగునీటి వాటర్ సోర్సతో పాటు ఫిల్టర్ పాయింట్లను నిరంతరం తనిఖీ చేయాలని, ఎక్కడా కలుషితమయ్యే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్లు చేపట్టాలని, ఓవర్హెడ్ రిజర్వాయర్ల క్లీనింగ్, క్లోరినైజేషన్ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశా, సచివాలయ సిబ్బందితో అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ఆసరాతో ఉచితంగా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టేలా ప్రోత్సహించి రైతుకు మంచి ఆదాయం వచ్చేలా చేయాలని, దీనికి సంబంధించి నిర్దేశించిన నాలుగు వేల ఎకరాల లక్ష్యంలో ఒక్క సెంటు కూడా తగ్గడానికి వీల్లేదని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఆర్డీవోలు, ఎంపీడీవోలు, ఏపీవోలు తదితరులు రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని ఆదేశించారు. ఇప్పటికి దాదాపు 50 శాతం లక్ష్యాలను చేరుకున్నందున మిగిలిన లక్ష్యాన్ని యుద్ధప్రాతిపదికన చేరుకునేందుకు కృషిచేయాలని స్పష్టం చేశారు. సన్న చిన్నకారు రైతులను పేదరికం నుంచి బయటపడేసేందుకు ఇదో గొప్ప మార్గమని.. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా వ్యవసాయ, ఉద్యాన, ఉపాధి హామీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డ్వామా పీడీ ఎ.రాము, డీపీవో పి.లావణ్యకుమారి, ఇన్చార్జ్ డీఎంహెచ్వో డా. జె.ఇందుమతి, జిల్లా మలేరియా అధికారి వి.మోతిబాబు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్దిదారులకు ఎల్.ఓ.సీ అందజేత

- **పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్**



**విజయవాడ పశ్చిమ, జూలై 09 (మనం న్యూస్):** ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన ఎల్.ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను బుధవారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ కార్పొరేటర్ అర్షద్ , కూటమి నేతలతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పంజా సెంటర్ కు చెందిన అబ్దుల్ షఫీ (36)మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. తనకి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపటంతో కార్పొరేటర్ అర్షద్ ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేశారు. రూ 5 లక్షల 40 వేల ఎల్ ఓ.సీ పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు. అదేవిధంగా 52 వ డివిజన్ కొత్తపేట చెందిన వై రమణమ్మ( 69) బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 2 లక్షల 85 వేల ఎల్.ఓ.సీ అందించారు. త్వరితగతిన ఎల్.ఓ.సీ మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు వేవిన నాగరాజు, మధు మస్తాన్, అట్లూరి బెనర్జీ,సుజనా మిత్రా కోఆర్డినేటర్లు సప్పా శ్రీనివాస్, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

# జై దుర్గ భవాని ...శాకంభరీ నమోస్తుతే..



**మొదటి పేజీ తరువాయి...**

ఇంద్రకీలాద్రి పై రెండవ రోజు శాకంభరిఉత్సవాలు రెండవ రోజైన బుదవారం నాడు ఘనంగా జరిగాయి. జులై 10 మూడవరోజు గురువారం ఉదయం 9:30 కు మహా పూర్ణాహుతితో ఉత్సవం సమాప్తమవనున్నది. కన్నులు విందుగా ఇంద్రకీలాద్రి పై రెండో రోజు అలంకరణ చేశారు. ఆలయ ఈవో శీనానాయక్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్ర నలుమూలల నుండి ఈ ప్రత్యేక పండగకు భక్తులరాకతో ఆలయం కిటకిటలాడింది. ఇప్పటివరకు ఆలయ అలంకరణ, కదంభం ప్రసాదం తయారీ నిమిత్తం సుమారు 50 టన్నుల పైనే కూరగాయలను వినియోగించినట్లు తెలుస్తోంది. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల దాతల నుండి కూరగాయయలను సేకరించారు. కూరగాయల సేకరణ నిమిత్తం ఆలయ సిబ్బంది 10 రోజులు నుండి శ్రమిస్తున్నారు. ప్రధాన ఆలయం లో కనకదుర్గ అమ్మవారు, మహా మండపంలో ఉత్సవమూర్తి, ఉపాలయాలల్లో దేవతా మూర్తులంతా హరిత వర్ణంతో విరాజిల్లుతున్నారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 వరకు ప్రత్యేక, అంతరాలయ దర్శనం రద్దు అని ఈవో శీనా నాయక్ ప్రకటించారు. భక్తులరద్దీ దృష్ట్యా దేవాలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. మూడవరోజు ముగింపు రోజు పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకునే అవకాశం ఉన్నందున సిబ్బంది సెలవులను రద్దు చేశారు.

## దుర్గమ్మ ఆలయంలో పలు ప్రాంతాల పరిశీలన చేసిన ఈవో



**విజయవాడ పశ్చిమ, జూలై 09 (మనం న్యూస్):** బుధవారం ఈవో వి.కె.శీనా నాయక్ దేవస్థానములో పలు చోట్ల తిరిగి భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు పట్ల ఆరా తీశారు. ముఖ్యంగా స్నానాల రేవులో ఒక సమాచార కేంద్రం, ప్రజా సమాచార కేంద్రం ఏర్పాటు. మొదలు భక్తుల ఉచిత బస్సు సౌకర్యం, ఘాట్ రోడ్డులో ఉన్న కెనరా బ్యాంక్ ఎటిఎం క్యాష్ మిషన్, కూల్ డ్రింక్ షాపులు విక్రయాలు, చెప్పులస్టాండు విషయమై భక్తుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటి మెరుగైన నిర్వహణకై, భక్తులు వెనువెంటనే అధికార్లకు ఫిర్యాదులు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు బుదవారం ఆలయ అధికారుల ఒక ప్రకటన విడుదల చేవారు. ప్రసాదాల కౌంటర్ల రికార్డు, స్నానాల రేవులో శానిటేషన్ తనిఖీ చేశారు. ఈవో తో పాటు అసిస్టెంట్ కమీషనర్, ఇంజనీరింగ్ సిబ్బంది, ఇతర పరిపాలానా సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టిమాఫియా దాహానికి యువకుడు బలి

**నందిగామ టౌన్, జూలై 09 (మనం న్యూస్):** ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురం గ్రామం లో టీడీపీ నాయకులు గత నెల రోజుల నుంచి గట్టు మట్టిని అక్రమంగా తవ్వుతున్నారు. గట్టు మట్టి లోడ్ చేస్తూ ఉండగా ఒక్కసారిగా కొండచర్యలు జెసిబి, ట్రిప్పర్ మీద కుప్పకులడం తో టిప్పర్ డ్రైవరు అక్కడికక్కడే మృతి చెందాడు.



## మధ్యాహ్నా భోజన పథకాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**హనుమాన్ జంక్షన్, జూలై 9 మనం న్యూస్:** కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బుదవారం బాపులపాడు మండలంలోని రేమల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులు తింటున్న ఆహారాన్ని రుచి చూసి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఏం చదువుకుంటున్నావు, స్కూల్లో చదువు బాగా చెబుతున్నారా, భవిష్యత్తులో ఏమవుతావు, ప్రతిరోజు భోజనం బాగుంటుందా అని ఆరా తీస్తూ విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఆయన పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ముందుగా జిల్లా కలెక్టర్, మాక్సిమస్ ఏఆర్సీ లిమిటెడ్ వారి సౌజన్యంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన నూతన ఆర్వో ప్లాంట్, కంప్యూటర్ ల్యాబ్, భోజనశాలను ప్రారంభించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు సహృదయంతో ముందుకు వచ్చిన మాక్సిమస్ ఏఆర్సీ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి దేవినేని నన్హ రామ్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన ప్రధానోపాధ్యాయుల చాంబర్లో ఉపాధ్యాయులతో సమావేశమై శుక్రవారం పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వాన సందేశాలు పంపడం, ప్రోగ్రెస్ కార్డుల గురించి వాకబు చేస్తూ కార్యక్రమం రోజున ప్రతి విద్యార్థి కొత్త స్కూల్ యూనిఫాం ధరించాలని, సర్వేపల్లి రాధా కష్ణన్ స్కూల్ కిట్లు ఉండాలని ఆయన ఆదేశించారు. ఉదయం 9 గంటలకు నుంచి కార్యక్రమాలు ప్రారంభం కావాలని, కార్యక్రమంలో విద్యార్థుల ప్రగతిని తెలిపి, తల్లిదండ్రులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు.



### కోకో పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్..

మండలంలోని రేమల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో బెజవాడ ఏడుకొండలు అనే రైతు 14 ఎకరాల్లో సాగు చేస్తున్న కోకో పంటను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.పంట సాగుకు అయ్యే ఖర్చు, వచ్చే దిగుబడి, సమస్యలు తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. మొక్క నాటిన రోజు నుంచి మూడు సంవత్సరాల తర్వాత పంట చేతికొస్తుందని, సాధారణ చాక్లెట్లతో పాటు యాంటీ డయాబెటిక్ చాక్లెట్ల తయారీ కంపెనీలకు అమ్ముతున్నట్లు రైతు కలెక్టర్ కు వివరించాడు. ఈ కార్యక్రమంలోగుడివాడ డివిజన్ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, తహసిల్దార్ మురళి కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లూథర్ పాల్, ఉద్యాన శాఖ అధికారిని జే జ్యోతి, ఏపీ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పార్థసారథి తదితరులు కలెక్టర్ తో పాటు ఉన్నారు.

## ఎంపీ కేశినేని శివనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ



**విజయవాడ తూర్పు, జూలై 09 (మనం న్యూస్):** మచిలీపట్నం మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ మర్యాదపూర్వకంగా ఎంపి కేశినేని శివనాథ్ ను బుధవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో కలిశారు. మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ కు ఎంపీ కేశినేని శివనాథ్ సాదర స్వాగతం పలికారు...ఎంపీ కేశినేని శివనాథ్ కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ సత్కరించారు. అనంతరం కాసేపు వీరిద్దరూ ప్రస్తుత రాజకీయాలపై పలు అంశాలు చర్చించుకున్నారు.

## హరితవనంగా మారనున్న మచిలీపట్నం నగరం

**మచిలీపట్నం జులై 9 (మనం న్యూస్):** హరితాంధ్రప్రదేశ్ వనం మనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన హరిత ఆంధ్రప్రదేశ్ వనం మనం కార్యక్రమం లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి లో వినూత్న రీతిలో ప్రభుత్వ ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయిన ప్రతి ఒక్క పేషెంట్ కు మొక్క ను అందించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ ఆశాలత డిస్చార్జ్ పేషెంట్లకు మొక్కలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపర్డెంట్ భానుమూర్తి, శ్రీనివాస్ ఆర్ఎంఓ నిరంజన్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## వెండి బంగారు నగలను తనిఖీ చేసిన దేవాదాయ శాఖ అధికారులు



**హనుమాన్ జంక్షన్, జూలై 9(మనంన్యూస్):** హనుమాన్ జంక్షన్ లోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం కు సంబంధించిన వెండి, బంగారు నగలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎండోమెంట్స్, జ్యూయలరి వెరిఫికేషన్ ఆఫీసర్ ( రాజమండ్రి ) వి.పళ్లంరాజు గురువారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ దేవాలయంలోని వెండి బంగారు నగలకు ఇన్సూరెన్స్ చేశారా అని అడిగారు. లేదని ఈఓ యార్లగడ్డ శ్రీనివాస్ చెప్పటంతో వెంటనే ఇన్సూరెన్స్ చేయాలని ఆదేశించారు. బంగారం 233 గ్రాముల 410 మిల్లీ గ్రాములు ఉన్నట్లు, వెండి 34 కేజీల 446 గ్రాముల 300 మిల్లీ గ్రాములు ఉన్నట్లు ధృవీకరించారు.భక్తులు ఎవరు ఎటువంటి విరాళాలు ఇచ్చినా కంపల్సరీ దేవాదాయ శాఖ కు సంబంధించిన రసీదు ఇవ్వాలని అన్నారు. లేకుంటే భక్తులు ఇచ్చిన వెండి బంగారు నగల అన్యాక్రాంతం అయ్యే అవకాశం ఉందని పళ్లంరాజు అన్నారు. దేవాలయంలో తప్పనిసరి సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.ఈ తనిఖీల్లో ఫౌండర్ ట్రస్టీ కాకాని అరుణ బాబు , తవ్వా పూర్ణచంద్రరావు, అర్చకులు చక్రావాధానుల సీతారామా రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## అవనిగడ్డలో జాతీయ సమ్మె విజయవంతం



**అవనిగడ్డ, జులై 9 (మనం న్యూస్) :** జాతీయ సమ్మెలో భాగంగా అవనిగడ్డలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన ధర్నా నిర్వహించారు. బుధవారం పది కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు వివిధ కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేయడంతో పాటు, సుప్రీంకోర్టు తీర్పు మేరకు కార్మికులకు పనికి సమాన వేతనం కల్పించాలని కోరుతూ, వివిధ కార్మిక సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అవనిగడ్డలోని రాజీవ్ చౌక్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అన్నపరెడ్డి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి యాసం శ్రీనివాసరావు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నపురెడ్డి నాగమణి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వై రమాదేవి లతోపాటు ఆటో వర్కర్స్ యూనియన్, కార్పెంటర్స్ అసోసియేషన్, ట్రక్కు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధిని వందేళ్లు వెనక్కు నెట్టిన జగన్

**అవనిగడ్డ,జులై 9 (మనం న్యూస్):** వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితుల సంక్షేమాన్ని, అభివృద్ధిని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వందేళ్ల వెనక్కు నెట్టాడని తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ మండల ప్రధాన కార్యదర్శి కర్రా సుధాకర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం అవనిగడ్డ మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా ప్రజలను అడిగి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కర్రా సుధాకర్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో జగన్ దళితులను చిన్నచూపు చూసాడని, ఎంతోమంది దళితుల మరణాలకు జగన్ కారణమయ్యాడని అన్నారు. ఎస్సీల అభివృద్ధి కోసం గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అనేక పథకాలను రద్దు చేసాడన్నారు. కేంద్రప్రభుత్వం ఇచ్చిన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను కూడా దిగమింగారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రారంభించి వాటికోసం వేల కోట్ల నిధులు కేటాయించారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిపనులు చూడలేక జగన్ పరామర్శల పేరుతో శవ రాజకీయాలు చేస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, గోశాల బాల కోటేశ్వరరావు, కమ్మిలి సుబ్రహ్మణ్యం, సనకా బసవయ్య, మత్తి నాగేశ్వరరావు, నడకుదిటి రవి, పరుచూరి దుర్గాప్రసాద్, మేడికొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై మహిళల ఆగ్రహం

**అవనిగడ్డ, జులై 9 (మనం న్యూస్) :** కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై అవనిగడ్డ నియోజకవర్గ తెలుగు మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసేవకు అంకితమైన మహిళలపై వ్యక్తిగత విమర్శలు చేయడం, మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ఒక మాజీ ఎమ్మెల్యే మాట్లాడితే, అటువంటి వ్యక్తిని ఆ పార్టీ అధినేత పార్టీ నుండి బహిష్కరించకుండా ఎందుకు మీనమేషాలు లెక్కపెడుతున్నాడని అన్నారు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తన రాజకీయ జీవితమంతా ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని, ప్రజల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసారని అన్నారు. పారదర్శకత, నైతికతకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా ప్రజలకు సేవ చేసే వ్యక్తిపై అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుమాలిన చర్యగా భావిస్తున్నామని, వేమిరెడ్డి ఇప్పటికైనా తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని ప్రజల సమక్షంలో బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు బండే కనకదుర్గ, సీనియర్ నేత విశ్వనాధపల్లి పాప, అన్నపురెడ్డి వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు



# పేషెంట్ ని కోసి కారం పెట్టిన ఎంఎన్ఓ



**మచిలీపట్నం, జూలై 9 (మనం న్యూస్):** మచిలీపట్నం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి నందు బుధవారం ఎం ఎన్ ఓ నిర్వాకంతో పేషంట్లు కంగు తింటున్నారు. శారదానగర్ కు చెందిన కొక్కిలిగడ్డ సురేష్ అనే వ్యక్తి 15 రోజుల క్రితం మద్యం మత్తులో ఇంటి మెట్లు ఎక్కుతూ ఉండగా కాలుజారి పడిపోవడంతో తలకు బలమైన గాయం అయ్యింది.వెంటనే మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స చేసి తలపై ఐదు కుట్లు వేశారు.తలపై కుట్లు వేసి 15 గడవడంతో తిరిగి కుట్లు తీయించుకోవడానికి ఆసుపత్రికి వెళ్ళాడు. డ్యూటీలో ఉన్న ఏం ఎన్ ఓ బలవంతంగా లాగడంతో కుట్లు వేసిన స్థానంలో మళ్ళీ గాయం అయ్యింది. సిబ్బంది అజాగ్రత్త వల్ల అదే స్థానంలో మళ్ళీ కుట్లు వేసి ఇంకో 15 రోజుల తరువాత రమ్మని పంపించేశారు.వైద్యం కోసం ఆసుపత్రికి వెళితే కోసి కారం పెట్టి పంపించేసినంత పనిచేశారు. ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ లేకపోవటం వల్ల సిబ్బంది పై పర్యవేక్షణ లోపించి ఇస్తారేతన వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర ప్రభుత్వ ఆసుపత్రి పై దృష్టి సారించి మెరుగైన వైద్య సేవలు అందేలా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## గొల్లపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



**విజయవాడ రూరల్, జూలై 09 (మనం న్యూస్):** సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), మైలవరం నియోజకవర్గ పరిశీలకులు, తెలుగుదేశం పార్టీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ లు పాల్గొన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ కు గొల్లపూడి దుర్గా, హరిజనవాడ ప్రాంత ప్రజలు, టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి తిరుగుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాది ఎన్డీయే కూటమి పాలనపై ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రజాభిప్రాయలు అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ఒక ఇంటిలో చదువుకునే విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు నగదు జమ చేయడంతో రాష్ట్రంలో మహిళలందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. మహిళల కోసం ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం అమల్లోకి రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పార్టీ అధ్యక్షుడు నూతలపాటి నారద, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు జంపాల సీతారామయ్య, బొమ్మసాని సుబ్బారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), గొల్లపూడి మార్కెట్ యార్డ్ చైర్మన్ నర్రా వాసు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాల పరిరక్షణకై దేశ వ్యాప్తసమ్మె విజయవంతం

- **సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్**



**మైలవరం జులై 09 మనం న్యూస్:** స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద నుండి బస్టాండ్ వద్ద సభ నిర్వహించుకొని పురవీధుల్లో బైపాస్ మీదగా తిరిగి నూజివీడు రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సమ్మె కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్స్, మధ్యాహ్నం భోజనం కార్మికులు, పంచాయతీ కార్మికులు, ముఠా కార్మికులు, సివిల్ సప్లై కార్మికులు, స్కూల్ స్లిప్పర్స్, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని దేశంలో ఎక్కడా అమలు జరగని 10 గంటల పని విధానం ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకువస్తుందని ఇది దుర్మార్గమైన చర్యని అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చినా వద్దనుండి కార్మికులపై కక్ష సాధింపు చర్యగా కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాసిందని అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో అంగన్వాడీ ఆశలకు సంక్షేమ పథకాలు అమలు జరగడంలేదని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు 11నేళ్లుగా తాళాలు వేసి ఉంచాలని 1100 కోట్లపై గా సంక్షేమ నిధులు గత ప్రభుత్వం కూటమి ప్రభుత్వం దారి మళ్ళించారని అన్నారు. తక్షణమే సంక్షేమ బోర్డు పునః ప్రారంభించి భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు, పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్, ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశవ్యాప్తంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, ముఠా ఆటో అసంఘటితరంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధరణికోట శ్రీను, మండల అధ్యక్ష కార్యదర్శులు మధు శ్రీనివాస్, సురేష్, వెంకటేశ్వరరావు, మర్రి వాసు, నరసింహారావు, నాగేశ్వరావు, సందీపాము విజయ్, కే కోటేశ్వరరావు, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వి వెంకటరెడ్డి, ఆర్ సుబ్బారావు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పుష్పకుమారి, సిహెచ్ శారద, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి జ్యోతి, రమణ, సంతోషం, పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు వీరమ్మ, చంద్రరావు, ప్రసాద్, మధ్యాహ్నం భోజన సంఘం నాయకులు శేషమ్మ, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపతిరావు, చంటి, సివిల్ సప్లై యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు బజార్ కంటే తక్కువ ధరకు కూరగాయాలు అమ్మితే నష్టపోతున్నాం

- **ప్రైవేట్ రైతు బజార్ ముందురైతు బజార్ అమ్మకం దారుల నిరసన**
- **వినియోగదారులకు తక్కువ ధరకు కూరగాయలు అందించడమే లక్ష్యం**
- **ప్రైవేట్ రైతు బజార్ యజమాని కొత్త కోటి నరసింహారావు(కోటి)**



**జగ్గయ్యపేట జూలై 9 మనం న్యూస్ :** రైతు బజార్లో ధరల కంటే ప్రైవేట్ మార్కెట్లోని కోటి రైతు బజార్లో తక్కువ ధరలకు కూరగాయల అమృతుంటే తాము నష్టపోతున్నామంటూ రైతుబజార్ కు చెందిన అమ్మకం దారులు ప్రైవేట్ కోటి రైతు బజార్ ముందు నిరసనకు దిగారు. బుధవారం మధ్యాహ్నం రైతు బజార్ లో కూరగాయలు విక్రయించే అమ్మకందారులు పెద్ద సంఖ్యలో మహిళలు పట్టణంలోని ప్రైవేట్ కోటి రైతుబజార్ ముందు నిరసన వ్యక్తం చేస్తూ ప్రైవేట్ రైతు బజార్ ముందు బైఠాయించారు. రైతు బజార్లో నిర్ణయించిన ధరలకంటే ప్రైవేట్ రైతు బజార్లో తక్కువ ధరలకు వికరిస్తుండడంతో తమ విక్రయాలు తగ్గాయని రైతుబజార్ ధరలకే బయట మార్కెట్లోనూ అమ్మకాలు చేయాలంటూ కోటి రైతు బజార్ ముందు పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మకం దారులు నిరసనకు దిగారు. ప్రైవేట్ రైతు బజార్ యజమాని కొత్తకోటి నరసింహారావు తో వాగ్వివాదానికి దిగారు. అమ్మకాలు జరక్కుండా అడ్డుకున్నారు.ఈ సందర్భంగా రైతు బజార్లో విక్రయాలు సాగించే పి డతల పద్మ, కుంచపు ఆదిలక్ష్మి ,తోటా సీత, వీరమ్మ తదితరులు మాట్లాడుతూ కోటి రైతుబజార్లో రైతుబజారు కంటే తక్కువ ధరలకు విక్రయిస్తుండటంతో తమ అమ్మకాలు తగ్గిపోయాయని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు తాము రైతు బజారులో విక్రయిస్తుంటే కావాలని తక్కువ ధరలకు తెచ్చి అమ్ముతున్నారంటూ వాపోయారు. అదేమని తాము అడగటానికి వస్తే తమ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు అని ఆరోపించారు. కోటి రైతుబజార్ ముందు పెద్ద సంఖ్యలో రైతు బజార్ అమ్మకం దారులు నిరసనకు దిగడంతో గాలి మిషన్ రోడ్ లో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది. విషయం తెలిసి పట్టణ ఎస్సై జి రాజు తన సిబ్బందితో విచ్చేసి రైతు బజార్ అమ్మకం దారులను శాంతపరచి వారిలో కొందరిని, అలానే ప్రైవేట్ రైతుబజార్ యజమాని కొత్తకోటి నరసింహారావునుస్టేషన్ వచ్చి సమస్యను వివరించాలంటూ ఇరువర్గాలను పోలీస్ స్టేషన్కు రమ్మని రైతు అమ్మ కందారులను అక్కడ నుంచి పంపించి వేశారు.


### వినియోగదారులకు తక్కువ ధర లకుకూరగాయలు అందించాలన్నదే లక్ష్యం :కోటి రైతు బజార్ యజమాని కొత్తకోటి నరసింహారావు



పట్టణంలోని వినియోగదారులకు సాధ్యమైనంతవరకు నాణ్యమైన కూరగాయలను తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతోనే తాను కూరగాయలను కొని అమ్మకాలు సాగిస్తున్నట్లు కోటి రైతుబజార్ యజమాని కొత్తకోటి నరసింహారావు తెలిపారు. తాను వినియోగదారులకు తక్కువ ధరకు ఇస్తుంటే కొందరు తనపై కావాలని తన షాపులపై ఆరోపణలు చేయిస్తున్నారని అన్నారు. గతంలో రైతు బజార్లు ఆలుగడ్డల కౌంటర్ తాను నిర్వహించే వాడిని తనను కావాలని బయటికి పంపించారని ఇప్పుడు తక్కువ ధరకు వినియోగదారులకు కూరగాయలు అందిస్తుంటే అది కూడా సాగనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తన రైతు బజారుకు వచ్చే వినియోగదారులను కనుక్కోవాలని నాణ్యమైన సరుకు తక్కువ ధరకు ఎక్కడ లభిస్తుందో వినియోగదారులని అడిగి వారి అభిప్రాయాన్నితెలుసుకోండి అంటూ కోటి రైతుబజార్ యజమాని నరసింహారావు అన్నారు. జిల్లాలో నిర్ణయించే ధరలకు రైతు బజార్లో అమ్ముతున్నామని చెబుతున్నారని కానీ ధరల్లో ఉన్న వ్యత్యాసాన్ని నిజమైన రైతులకు గతంలోనే వివరించానని ఆయనతెలిపారు. కాగా కోటి రైతు బజార్ ముందు రైతు బజార్ అమ్మకం దారులు నిరసన తెలియజేస్తుండగా పలువురు వినియోగదారులు కోటి రైతు బజారుకు మద్దతుగా రైతు బజార్ అమ్మకంధారులపై వాదనకు దిగారు. తక్కువ ధరకు కూరగాయలు విక్రయిస్తుంటే అక్కడ రేటుకి ఇక్కడ కూడా అమ్మాలంటూ మీరు ఇక్కడకు రావడమేంటంటూ ప్రశ్నించారు. రైతు బజార్లో తమను కూరగాయలు ఏరుకోనివ్వరని రేటు కూడా సక్రమంగా ఉండదని ఎక్కువ రేటుకి అమ్ముతున్నారని పలువురు బహిరంగంగానే పలువురు వ్యాఖ్యానించారు.

# రైతు బజార్లో తక్కువకు అమ్మరు

- **బయట ఎవరైనా అమ్మితే ఊరుకోరు**
- **జగ్గయ్యపేట రైతు బజార్ తీరుపై పేటలో విస్తృత చర్చ**





**జగ్గయ్యపేట జూలై 9 మనం న్యూస్ :** జగ్గయ్యపేట రైతు బజార్ తీరుపై పట్టణవాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారునికి తక్కువ ధరకు కూరగాయలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుమారు20 సంవత్సరాల క్రితం రైతు బజార్లను ప్రారంభించారు. రైతులు రైతుమార్కెట్ కు తన కూరగాయలనుతీసుకొని వచ్చి అధికారులు రైతులు కూర్చునిధరను నిర్ణయించుకొని అమ్మకాలు చేయాలి అన్నది లక్ష్యం గా రైతుబజారులు ఏర్పాటు అయ్యాయి. దీనివల్ల అటు వినియోగదారునికి ఇటు అమ్మకం దారికి లాభం కలుగుతుందన్నది ప్రభుత్వ లక్ష్యం. స్థానికంగా లభ్యమయ్యే కూరగాయల ధరలను స్థానికంగానే ధరలు నిర్ణయించాలని నిబంధన సైతం గతంలోని ఏర్పాటు చేశారు. కానీ నేటి జగ్గయ్యపేట రైతు బజారు తీరు చూస్తే ప్రైవేట్ బజార్లో తక్కువ ధర దొరుకుతున్న కూరగాయలు ప్రభుత్వ రైతు బజార్లో ఎందుకు ఎక్కువ ధర పలుకుతున్నాయో అంటే సమాధానం మాత్రం కరువు అవుతుంది. ఉదాహరణకు ప్రభుత్వ రైతు బజార్లో టమాటా ధర బుధవారం 36 రూపాయలుగా ప్రభుత్వ రైతు మార్కెట్లో అమ్ముతుంటే, అదే టమాట ప్రైవేట్ లోని కోటి రైతు బజార్లో 30 రూపాయలకు అమ్ము తుండటంతో పెద్ద సంఖ్యలో వినియోగదారులు ప్రైవేట్ బజారు వైపు మొగ్గుచూపుతున్నారు. ఇలానే కూరగాయల ధరల్లో వ్యత్యాసాలు నిత్యం కనిపిస్తుండటంతో రైతు బజారు లో కొనుగోలు దారులు ప్రైవేట్ రైతు బజార్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ విషయమై గతంలోని రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ వెంకటరమణ వివరణ కోరగా తామకు విజయవాడ నుంచి ధరలు నిర్ణయించి వస్తాయని ఆ ధరల ప్రకారం తాము అమ్మకాలు సాగిస్తున్నామని వివరించారు. కానీ ప్రభుత్వ రైతు బజారులో ఒక ధర అదే రైతు బజార్ అనుబంధంగా ఉన్న కొత్త రైతు బజార్లో మరో ధరకు టమాటాలు ఎందుకు తగ్గించి అమ్ముతున్నారు అన్న ప్రశ్నకు వినియోగదారులకు కొత్త రైతు బజార్ ను అలవాటు చేసేందుకు అక్కడ అమ్మకాలు తక్కువ ధరకు అందిస్తున్నమంటూ గతంలో వారు సమాధానమిచ్చారు. ముఖ్యంగా టమాట ,ఉల్లిగడ్డ ,వంకాయ వంటి నిత్యం అతి ఎక్కువగా వినియోగదారులు ఉపయోగించే కూరగాయల ధరలు ప్రభుత్వ రైతుబజార్ కంటే ప్రైవేట్ లోని కోటి రైతు బజార్లో 3 నుంచి 6 రూపాయలు తక్కువ ధర ఉండటంతో గత రెండు నెలలుగా రైతు బజార్లోని ధరలు వివాదాస్పదంగా మారాయి. పలు విమర్శలకు దారితీస్తున్న విషయం విధితమే.ఈ విషయం ఇలా ఉంటే బుధవారం రైతు బజారులోని అమ్మకందారులు కోటి రైతు బజారు పైకి దండ యాత్రగా వెళ్లి నట్లు వెళ్లి రైతు బజారులో నిర్ణయించిన ధరలకే ప్రైవేటు మార్కెట్ లో ను అమ్మకాలు చేయాలంటూ డిమాండ్ చేయటం పట్ల పట్టణవాసులు విస్మయం వ్యక్తం చేస్తూన్నారు . ప్రభుత్వం ధరకంటే ప్రైవేట్ వ్యక్తి తక్కువ ధరకు ఇస్తుంటే మీకు వచ్చిన అభ్యంతరం ఏంటంటు ప్రశ్నిస్తున్నారు. అమ్మకం దారుడు తాను లాభం చూసుకునే అమ్మకం చేస్తాడని అలాంటిది ఐదు నుంచి ఆరు రూపాయలు రైతు బజార్ కంటే తక్కువకు ఇస్తుంటే రైతు బజార్ ధరకే అమ్మాలంటూ మీరు ఎలా ఒత్తిడి చేస్తారంటూ పట్టణవాసులు పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ రైతు బజార్లో అమ్మిన ధర గిట్టుబాటు కాకపోతే అమ్మిన వ్యక్తి నష్టపోతాడని రైతు బజారులోని అమ్మకంధారులకు వచ్చిన బాధ ఏమిటి అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు జగ్గయ్యపేట రైతు బజార్ లోని ధరల విషయమై దృష్టి సారించాలని రైతు బజారు నిర్వహణ తీరుపై సరైన చర్యలు తీసుకోవాలని వీలైతే ప్రైవేట్ రైతు బజారు కంటే తక్కువ ధరలకు కూరగాయలు అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని జగ్గయ్యపేటవాసులు కోరుతున్నారు.

# నందిగామలో వామపక్షాల భారీ నిరసన ర్యాలీ



**నందిగామ, జూలై 09 (మనం న్యూస్):** నాలుగు నల్ల చట్టాలు ద్వారా కార్మికుల హక్కులను భంగం కలిగించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దుశ్చర్యలకు పాల్పడుతున్నాయని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి గాంధీ సెంటర్ వరకు ప్రజా సంఘాలు,సిఐటియు అనుబంధ సంస్థలు, వామపక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సును గాలికి వదిలేసి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నల్ల చట్టాలకు, రాష్ట్రప్రభుత్వాలు కొమ్ముకాస్తూ పేద బడుగు బలహీనవర్గాల కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు, కొంతమంది శ్రేయస్సు కోసమే పనిచేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను బానిసలుగా చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్లను తయారు చేసి గతంలో కార్మికులకు ఉపయోగపడే విధంగా ఉన్న చట్టాలను రద్దుచేసి,నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలని చూస్తున్న కేంద్రప్రభుత్వం కేంద్రం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆమోదం తెలియజేయడం చాలా దురదృష్టకరమని అన్నారు దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులకు ఉపయోగపడే విధంగా తీసుకొస్తున్న చట్టాలను వెంటనే రద్దు చేయాలని పాత పద్ధతిలోనే కార్మికుల హక్కులను కాపాడాలని అన్నారు. కార్మికుల ప్రయోజనాలను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై దేశవ్యాప్తంగా కార్మికులందరూ వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేస్తూ కార్మికుల ఐక్యతను కాపాడుకుంటూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ పలు డిమాండ్లను వారు ప్రభుత్వాలకు విడుదల చేశారు నాలుగు లేబర్ కోడ్ల రద్దు వెంటనే రద్దు చేయాలని,కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలనీ,ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న ఆయా మధ్యాహ్నం భోజన పథకం నైట్ వాచ్మెన్ల కు పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలనీ,రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలనీ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేయాలనీ, ప్రమాదవశాత్తు మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడికి 10 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలనీ,మోటార్ రంగ కార్మికులను ఇబ్బందులు గురిచేసే జీవో నెంబర్ 21ని తక్షణమే రద్దు చేయాలనీ, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలనీ,ప్లాట్ ఫామ్ రిక్షా తోపుడుబండ్ల కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ,ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించ రాదని,4 కార్మిక చట్టాల అమలను తక్షణమే నిలిపివేయాలనీ వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి చుండూరు వెంకట సుబ్బారావు,సిఐటియు నాయకులు కటారపు గోపాల్,సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కట్టా చామంతి,మండల కార్యదర్శి అంజి, ముఠా కార్మికులు, ఆటో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# ప్రకృతి వ్యవసాయం విధానంతో అధిక లాభాలు

- **జిల్లా కలెక్టర్ బాలాజీ**



**హనుమాన్ జంక్షన్, జూలై 9 మనం న్యూస్:** ప్రకృతి వ్యవసాయం విధానంతో అధిక లాభాలు పొందవచ్చు అని, ఆ దిశగా రైతులందరూ ఆలోచన చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పొలాలను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఎకరం పొలం కౌలుకు తీసుకుని ప్రకృతి వ్యవసాయం విధానంలో వరిని సాగు చేస్తున్న గ్రామానికి చెందిన చలం ప్రసాద్ అనే రైతుతో మాట్లాడారు. సాగుకు అయ్యే ఖర్చు, దిగుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించే రైతులు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉండవని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చు అన్నారు. రసాయనిక పద్ధతిలో చేపట్టే వ్యవసాయానికి అధిక పెట్టుబడి పెట్టడంతో పాటు భూసారాన్ని కోల్పోవడం, ఆహారం, నీటి కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడటం వంటి దుష్ప్రభావాలను ఎదురుకోవాల్సి వస్తుందన్నారు. రసాయనిక పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించాలని సూచించారు. రైతులు పచ్చిరొట్టగా పొలంలో నవధాన్యాలను చల్లుకొని నేలను మరింత సారవంతంగా మార్చుకోవచ్చని, తద్వారా రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గుడివాడ డివిజన్ ఆర్డీఓ జి బాలసుబ్రహ్మణ్యం, ఏపీ ప్రకృతి వ్యవసాయ డిపిఎం పార్థసారథి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి జె జ్యోతి, తహసిల్దార్ మురళీ కృష్ణ రైతులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

**చందర్లపాడు, జూలై 9 మనం న్యూస్:** దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా బుధవారం ఉదయం చందర్లపాడు అలివేలమ్మ తల్లి గుడి సెంటర్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్, ఆశ వర్కర్లు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్,కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సి.హెచ్ శ్రీనివాస్ సిఐటీయుమండల కార్యదర్శి వేల్పుల ఏసోబుమాట్లాడుతూ కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలి. ప్రస్తుత కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని,లేబర్ వెల్ఫేర్ ఫండ్ పునరుద్దరించాలి. నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పనిచేయించి పథకాలను అమలు చేయాలి,ఈ శ్రమలో నమోదైన వారందరికీ సామాజిక భద్రత కల్పించాలని, ఆటో, ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్, హాకర్స్ తదితర అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు .అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. వారికి రక్షణ కల్పించేలా జాతీయ విధానాన్ని రూపొందించాలని, జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాలను రద్దు చేయాలని,విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలన్నారు .కడప ఉక్కును నిర్మించాలని,కార్మిక చట్టాలను, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేసే లేబర్ అధికారుల విధానాన్ని పునరుద్ధరించాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలి. స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠ పరచాలి. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను నియంత్రించాలని తదితరఅంశాలపై డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు ఈదరకమల, వేల్పుల రాణి, భారతి, అంగనవాడి వర్కర్స్ యూనియన్ నాయకులు వేమవరపు పిచ్చమ్మ, లక్ష్మి, సుజాత, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు తోట రామారావు, మధ్యాహ్న భోజన కార్మికులు వి కుమారి ప్రజాశక్తి విలేకరి అరిగెల చిన్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




# సుపరిపాలన తొలి అడుగుతో ప్రజలందరికీ మరింత సంక్షేమం

- **తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లంక లితీష్**

**మైలవరం జులై 09 మనం న్యూస్:** సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి ప్రచారంతో ప్రజలందరికీ మరింత సంక్షేమం చేకూర్తుందని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ అన్నారు. తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని 92బూత్ లో గడపగడపకు తిరుగుతూ ఏడాది పాలనలో రాష్ట్రం ప్రభుత్వం చేసిన, చేయబోయే సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధి కై ఎమ్మెల్యే వసంత చేస్తున్న కృషిని ప్రజలకు వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# రైతు బజారును తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్



**మైలవరం, జులై 09 మనం న్యూస్:** స్థానిక రైతు బజారును జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఖాళీగా ఉన్న షాపులను వెంటనే ఫిల్ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. రైతుల వద్ద నుండి కూరగాయల సేకరించి అతి తక్కువ ధరలకే వినియోగ దారులకు కృషి చేస్తున్నామన్నారు. ఎవరైనా రైతు బజార్ లో షాప్ పెట్టకునేవాళ్ళు ఉంటే కచ్చితంగా అవకాశం ఇస్తామన్నారు.

# డ్రైనేజీల పనులు సమర్ధవంతంగా చేయాలి

- **ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సమీక్ష**



**అవనిగడ్డ, జూలై 9 (మనం న్యూస్):** అవనిగడ్డ నియోజకవర్గంలో చేపట్టిన డ్రైనేజీల పనులు సమర్ధవంతంగా చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. బుధవారం అవనిగడ్డలోని తమ కార్యాలయంలో డ్రైనేజీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. లింగన్నకోడు కిక్కిస తొలగింపు, గుండేరు పూడికతీత పనులు జరుగుతున్న తీరు అధికారులు వివరించారు. కృష్ణాపురం - నరసింహాపురం కిక్కిస తొలగింపు పనులకు ప్రతిపాదనలు రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎస్.డీ.ఎం.ఎఫ్, ఓ అండ్ ఎం పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డ్రైనేజీ శాఖ ఈఈ బీ కిరణ్ బాబు, డీఈఈ జే.బాబు నాయక్, ఏఈఈలు అబ్దుల్ కరీం, చిరంజీవి పాల్గొన్నారు.

# అవనిగడ్డలో నేడు డయల్ యువర్ డి.ఎం

**అవనిగడ్డ, జులై 9 (మనం న్యూస్ ) :** అవనిగడ్డ ఏపీఎస్ ఆర్టీసీ డిపోనందు నేడు డయల్ యువర్ డి.ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అవనిగడ్డ డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు తమ ప్రయాణ అవసరాలపై తగు సూచనలు, సలహాలు, సమస్యల గురించి తెలియచేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం 11.30 గంటల నుండి 12.30 గంటల మధ్యలో 9959225466 నంబర్ కి ఫోన్ చేయవలసిందిగా ఆయన కోరారు.



# పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదు

- విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం ఆదేశాలు



**విజయవాడ సెంట్రల్, జూలై 09 (మనం న్యూస్)** నగరంలో పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఎంజి రోడ్, కేజీ గుప్తా కాలనీ, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్, గాయత్రి నగర్, తిక్కిల్ రోడ్, బెంజ్ సర్కిల్ నేషనల్ హైవే, సర్వీస్ రోడ్, బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్, కనకదుర్గ వారధి ఫ్లైఓవర్ ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, నగరాన్ని అందంగా పరిశుభ్రంగా ఉంచాలని, నగరంలో ఉన్న బ్లాక్ స్పాట్స్, గార్బజ్ వాల్నరబుల్ పాయింట్స్ ని గ్రీన్ స్పాట్స్ గా మార్చాలని, అక్కడ మొక్కలను పెట్టడం ద్వారా కాలుష్యం నివారించడమే కాకుండా ఆరోగ్యకరమైన వాయువును మనం పొందవచ్చు అని అన్నారు. ఫినిమినేని పాలి క్లినిక్ రోడ్ లో జరుగుతున్న డ్రైనేజ్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అన్నారు. తదుపరి కృష్ణలంక హైవే, సాయిబాబా గుడి వద్ద గల అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. ఆహారంలో నాణ్యత, త్రాగునీటి సరఫరా, వాడుకునీటి సరఫరా, అక్కడున్న వసతుల్లో ఎటువంటి లోపం ఉండరాదని ఏవైనా వరమతులు వచ్చిన వెంటనే స్పందించి మరమతులన్నీ చేయించి పూర్తిస్థాయిలో అందుబాటులో తీసుకురావాలని, ప్రతిరోజు నోడల్ ఆఫీసర్లు తమ తమ అన్న క్యాంటీన్ ని పరిశీలించి ఎటువంటి మరమ్మతులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల కృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# క్యాంపు కార్యాలయంలో చేతి కర్రలు పంపిణీ చేసిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



**విజయవాడ పశ్చిమ, జూలై 09 (మనం న్యూస్):** పక్షవాతంతో నడవలేక ఇబ్బంది పడుతున్న ఇద్దరు బాధితులకు ఎంపీ కేశినేని శివనాథ్ పశ్చిమ నియోజకవర్గం గణపతి రావు రోడ్డు లో గల ఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం చేతి కర్రలు పంపిణీ చేశారు. పక్షవాతానికి గురైన 51 వ డివిజన్ కి చెందిన పొలుసు నాని , 47వ డివిజన్ కి చెందిన ఎరుపల్లి నారాయణమ్మలకు చేతి కర్రలు ఎంపీ కేశినేని శివనాథ్ అందజేశారు. పక్షవాతంతో బాధపడుతూ రాలేకపోయిన ఎరుపల్లి నారాయణమ్మ తరుపున ఆమె భర్త రామారావు కి చేతి కర్ర అందజేయటం జరిగింది. పేద ప్రజలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండగా వుంటుందని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్.మాధవ, క్లస్టర్ ఇంచార్జి సుఖాసీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉయ్యూరులో సుపరిపాలనలో తొలిఅడుగు

**ఉయ్యూరు, జూలై 09 (మనం న్యూస్):** ఉయ్యూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జంపాన గుర్నాధం ఆధ్వర్యంలో సుపరిపాలన లో తొలిఅడుగు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఉయ్యూరులోని 3 వార్డు సాయి మహల్ సెంటర్లో ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలను తెలుసుకుని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గూర్చి వివరించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో పెన్షన్ 4000 చేశారని, తల్లికి వందనం కింద మీ ఇంట్లో ఎంతమంది బడికి వెళ్లే బిడ్డలు ఉంటే అంతమందికి కూడా ఆ పథకాన్ని తల్లులు ఖాతాల్లో వేశారని, ఏడాదికి మూడు గ్లాస్ సిలిండర్లు పథకాన్ని కూడా అమలు చేశారని, ఇప్పుడు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కూడా కల్పించడం జరుగుతుందని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యన్నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

- బోబ్బా గోవర్ధన్ (ఎన్ ఆర్ ఐ)



**కోడూరు, జులై 9 (మనం న్యూస్):** చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం సంవత్సర కాలంలో సాధించిన విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్ళాలని అవనిగడ్డ నియోజకవర్గ సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్ సూచించారు. కోడూరు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, బూత్ ఇంచార్జిలకు సుపరిపాలనకు తొలి అడుగు- ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ అనుభవజ్ఞుడైన నాయకుడు చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూ, సంపద సృష్టిస్తు ఆ ఫలాలను పేదలకు అందేలా పని చేస్తున్నారన్నారని, కేవలం సంవత్సర కాలంలోనే రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి చేశారని, పోలవరం పనులు పరుగులు తీస్తున్నాయని, కొత్త పరిశ్రమలను ఆహ్వానిస్తూ ఉద్యోగ కల్పన చేపట్టారన్నారు. ప్రభుత్వం సాధించిన విజయాలను గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించడంతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని పార్టీకి ప్రజల స్పందన తెలపాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల స్పందనను బాట్ లో నమోదు చేయాలని ఇందులో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో 20 మంది సాంకేతిక సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారిలో మండలానికి ఇద్దరు చొప్పున సేవలు అందిస్తారని, అవసరమైన సమయంలో మండలాలకు అదనంగా సిబ్బందిని పంపిస్తామని గోవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితుడైన కొల్లూరు వెంకటేశ్వరరావును మండల తెలుగుదేశం పార్టీ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్ర సుధాకర్, పూతబోయిన శ్రీనివాసరావు, అప్పికట్ల రవీంద్ర, తోట సాంబయ్య, పిల్లి మల్లికార్జునరావు, అద్దంకి పాండురంగారావు, కాగిత ప్రసాద్, వేములపల్లి రాజేష్, ఉప్పాల పోతురాజు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, ఇమ్రాన్, కడవకల్లు నాంచారయ్య, ఉప్పాల కోటేశ్వరరావు,మోర్ల మాణిక్యాలరావు, మేడికొండ విజయ్, గంజాల సుందర్రావు,వేములపల్లి శ్రీకృష్ణ స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలి



- డిపిటివో కె.వెంకటేశ్వర్లు

**అవనిగడ్డ, జులై 9 (మనం న్యూస్):** ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కృష్ణాజిల్లా ప్రజా రవాణా అధికారి(డ్రఖీ) కె.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సాయంత్రం అవనిగడ్డ ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. డిపోలోని అన్ని విభాగాల రూములను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. బస్ స్టేషన్ నందు మరుగుదొడ్లు, కార్గో సెక్షన్, మహిళా సిబ్బంది విశ్రాంతి గదిని, త్రాగునీటి సౌకర్యాన్ని, ఇతర విభాగాలు రూములను, బస్టాండ్ నందు ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించి మరుగుదొడ్లను మరింత మెరుగ్గా మెయింటెన్ చేయాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని, ఆగస్టు 15 తేదీ నుండి రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న మహిళలకు ఉచిత ప్రయాణ పథకం గురించి వివరించి ఆ పథకం విజయవంతం కావడానికి బస్సులను మరింతగా మెరుగ్గా నడపవలసిందిగా సిబ్బందిని కోరారు. అంతకుముందు నాగాయలంక బస్ స్టేషన్ సందర్శించిన ఆయన బస్టాండ్ లో ఉన్న ఓస్-15 లీజు స్థలాన్ని పరిశీలించారు. షెడ్యూల్ - 3, షెడ్యూల్ - 4 బస్సులను ఇన్స్పెక్షన్ చేసి సిబ్బందితో కలిసి రోడ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కె.హనుమంతరావు, అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్ శ్రీ లక్ష్మి , అసిస్టెంట్ ఇంజనీర్ దివ్య , సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ఫ్లోర్ పెయింటింగ్ కాంపిటీషన్ లో పాల్గొని నగదు బహుమతులను గెలుచుకోండి

- విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం



**విజయవాడ సెంట్రల్, జూలై 09 (మనం న్యూస్):** ఫ్లోర్ పెయింటింగ్ కాంపిటీషన్లో పాల్గొని, నగరంలోని పర్యాటక ప్రదేశాన్ని సుందరీకరించమని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అన్నారు. బుధవారం నాడు ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో ఫ్లోర్ పెయింటింగ్ కాంపిటీషన్లో ప్రజల భాగస్వాములు కావాలని ప్రకటన ద్వారా తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశా గారి ఆదేశాల మేరకు, స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా, నగరంలోని ప్రధాన పర్యాటక ప్రదేశం అయిన బర్మ్ పార్క్ ను సుందరీకరించే దిశగా, ఫ్లోర్ పెయింటింగ్ కాంపిటీషన్ లో భాగస్వాములు కావాలని నగరంలోని ప్రజలకు కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ పెయింటింగ్ కాంపిటీషన్లో రెండు కేటగిరీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు మొదటి కేటగిరీలో 12 సంవత్సరాల కంటే ఎక్కువగా ఉన్నవారు నేలపైన పెయింటింగ్లు వేయగా 12 సంవత్సరాల కంటే తక్కువ వయసుగల పిల్లలు డ్రాయింగ్ షేప్ ల పైన డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నారని అన్నారు. ఫ్లోర్ పెయింటింగ్ కు నగదు బహుమతులుగా మొదటి బహుమతి పదివేల రూపాయలు రెండవ బహుమతి 7500 రూపాయలు మూడో బహుమతి 5వేల రూపాయలు 4వ బహుమతి 3000 రూపాయలు మరియు వెయ్యి రూపాయల కన్సోలేషన్ బహుమతులు ఐదు ఉన్నాయని తెలిపారు. రెండో క్యాటగిరి అయిన 12 సంవత్సరాల లోపు పిల్లలకు డ్రాయింగ్ కాంపిటీషన్లో ట్రోఫీ బహుమతులు ఉన్నాయని తెలిపారు. ఫ్లోర్ పెయింటింగ్ మరియు డ్రాయింగ్ కాంపిటీషన్లో పాల్గొనేందుకు 7075196840 కు దరఖాస్తు చేయవలసిందిగా వెల్లడించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఉంటాయని తెలిపారు.

# మచిలీపట్నం వైద్య సేవకి వెళ్లాలంటే భయం

**మచిలీపట్నం జూలై 9 (మనం న్యూస్):** మచిలీపట్నం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి నందు బుధవారం ఎం ఎన్ ఓ నిర్వాకంతో పేషంట్లు కంగు తింటున్నారు. శారదానగర్ కు చెందిన కొక్కిలిగడ్డ సురేష్ అనే వ్యక్తి 15 రోజుల క్రితం మద్యం మత్తులో ఇంటి మెట్లు ఎక్కుతూ ఉండగా కాలుజారి పడిపోవడంతో తలకు బలమైన గాయం అయ్యింది.వెంటనే మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స చేసి తలపై ఐదు కుట్లు వేశారు.తలపై కుట్లు వేసి 15 రోజులు గడవడంతో తిరిగి కుట్లు తీయించుకోవడానికి ఆసుపత్రికి వెళ్ళాడు. డ్యూటీలో ఉన్న ఏం ఎన్ ఓ బలవంతంగా లాగడంతో కుట్లు వేసిన స్థానంలో మళ్ళీ గాయం అయ్యింది. సిబ్బంది అజాగ్రత్త వల్ల అదే స్థానంలో మళ్ళీ కుట్లు వేసి ఇంకో 15 రోజుల తరువాత రమ్మని పంపించేశారు. వైద్యం కోసం ఆసుపత్రికి వెళితే కోసి కారం పెట్టి పంపించేసినంత పనిచేశారు. ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ లేకపోవటం వల్ల సిబ్బంది పై పర్యవేక్షణ లోపించి నిర్లక్ష్యంగా వైద్య సేవలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్ర ప్రభుత్వ ఆసుపత్రి పై దృష్టి సారించి మెరుగైన వైద్య సేవలు అందేలా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.